క్లుప్తంగా

కోటగిరి వైస్ ఎంపీపీకి పితృ వియోగం


హన్మంత్‌రావ్ (ఫైల్)

రుద్రూర్: కోటగిరి వైస్ ఎంపీపీ గంగాధర్ పటేల్ తండ్రి హన్మంత్ రావ్ పటేల్(82) ఆదివారం తెల్లవారు జామున మృతి చెందారు. పోతంగల్ గ్రామంలో సుదీర్ఘకాలం పాటు హన్మంత్‌రావ్ పటేల్ రెవెన్యూ శాఖలో పట్వారీగా విధులు నిర్వర్తించి పదవీ విరమణ పొందారు. హన్మంత్ రావ్ మృతి పట్ల పలువురు నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

ఉచిత వైద్య శిబిరం

బాల్కొండ: మండలంలోని వన్నెల్(బి)లో సుశ్రుత పిల్లల ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పిల్లలకు పలు రకాల పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. ఉప సర్పంచ్ కిషన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైద్యానికి ఆర్థిక సహాయం అందజేత



కమ్మర్‌పల్లి: మండల కేంద్రానికి చెందిన వంజరి రాజు ఇటీవల పక్షవాతానికి గురై కాళ్లు, చేతులు పనిచేయక పోవడంతో ఆరెంజ్ ట్రావెల్స్ అధినేత ముత్యాల సునీల్‌కుమార్ ఆదివారం ఆయనను పరామర్శించారు. వైద్యం కోసం రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఆయన ఆరోగ్యపరిస్థితిని తెలుసుకొని ధైర్యం కల్పించారు. ఆయన వెంట సునీల్‌సేన సభ్యులు ఉన్నారు.

ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

వేల్పూర్: పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని, ఈనెల 4న ఆర్మూర్ ఆర్డీవో ఆఫీసు ఎదుట నిర్వహించే ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ వర్కర్స్ అసోసియేషన్ ఆర్మూర్ డివిజన్ అధ్యక్షుడు సాయన్న ఆదివారం పేర్కొన్నారు. ఉదయం 11 గంటల నుంచి నిర్వహించే ధర్నా కార్యక్రమానికి ఆర్మూర్ డివిజన్‌లోని రిటైర్డు ఉద్యోగులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పిచ్చిమొక్కల తొలగింపు



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని జర్నలిస్ట్ కాలనీలో కాలనీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం స్వచ్ఛకాలనీ– సమైక్య కాలనీ కార్యక్రమాన్ని నిర్వహించారు. అందులో భాగంగా రెండు గంటలు శ్రమదానం చేసి కాలనీలో రోడ్లు, మురుగు కాలువలను శుభ్రం చేసి, పిచ్చి మొక్కలను తొలగించారు.. జర్నలిస్ట్ కాలనీని పరిశుభ్రంగా ఉంచడానికి గత ఆరు వారాలుగా ప్రతి ఆదివారం శ్రమదానం చేస్తున్నారు. కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గోసికొండ అశోక్, హనుమాన్ ఆలయ కమిటీ అధ్యక్షుడు శివరాజ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం


టి.శ్రీనివాస్

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ తిరుమల కాలనీ విశ్వ బ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా టి. శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా రాజన్న, కోశాధికారిగా ఎన్.నరేందర్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ.. సంఘం అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

అభినందన సభకు తరలిన విద్యార్థులు



పెర్కిట్(ఆర్మూర్): సోమ వంశీయ సహస్రార్జున క్షత్రియ ప్రాంతీయ సమాజ్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్‌లో ఆదివారం నిర్వహించనున్న ఉత్తమ విద్యార్థుల అభినందన సభకు ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి నుంచి విద్యార్థులు తరలి వెళ్లారు. మామిడిపల్లి ఎస్ఎస్‌కే సమాజ్ అధ్యక్షుడు ఖాండేశ్ సుదర్శన్ ఆధ్వర్యంలో విద్యార్థులు, సమాజ్ సభ్యులు బయలుదేరి వెళ్లారు.

మంజూరు ఓచోట.. నిర్వహణ మరోచోట

- స్థలం ఉన్నా.. నిధులు లేక ముందుకు సాగని గురుకుల పాఠశాల నిర్మాణం
- ఇబ్బందిపడుతున్న విద్యార్థినులు


నవీపేటలో గురుకుల పాఠశాల నిర్మాణానికి కేటాయించిన స్థలం

నవీపేట: నవీపేటకు సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల మంజూరైందని మండల వాసులు సంబరపడ్డారు. సొంత మండలంలోనే ఉన్నతమైన విద్యను పొందవచ్చని నిరుపేద తల్లిదండ్రులు సంతోషపడ్డారు. కానీ ఆ సంతోషం..కొన్నాళ్ల ముచ్చటగానే మిగిలిపోయింది. 2016లో నవీపేటకు గురుకుల పాఠశాల మంజూరైంది. మండల కేంద్రంలో అనువైన ప్రభుత్వ భవనం లేకపోవడంతో కొన్నాళ్లు మోపాల్ మండలంలోని కంజర గురుకుల పాఠశాలలో అదనంగా పాఠశాలను కొనసాగించారు. తరువాత 2017లో పోతంగల్ గ్రామంలో అద్దె భవనంలో పాఠశాలను కొనసాగించారు. పల్లె గ్రామంలో అనువైన సౌకర్యాలు లేకపోవడంతో అధ్యాపకులు, విద్యార్థినులు అవస్థలు పడ్డారు. ఏడాది పాటే పోతంగల్‌లో పాఠశాల కొనసాగింది.

జిల్లా కేంద్రంలోని వినాయక్‌నగర్‌కు మార్పు..

చివరిగా జిల్లా కేంద్రంలోని వినాయక్‌నగర్‌కు నవీపేట గురుకుల పాఠశాలను మార్చారు. ప్రస్తుతం అద్దె భవనంలోనే ఈ పాఠశాల కొనసాగగా 500 మంది విద్యార్థినులు ఉన్నారు. ఏడాది కిందట పాఠశాలను అప్‌గ్రేడ్ చేసి ఇంటర్మీడియట్ ఎంపీపీ గ్రూపును కొనసాగిస్తున్నారు. మొదట్లో అనువైన ప్రభుత్వ స్థలం కోసం నవీపేటతో పాటు చుట్టు పక్కల గ్రామాలల్లో వెతికారు. నవీపేట శివారులో 103 సర్వే నంబరులో గురుకుల పాఠశాల నిర్మాణానికి పదెకరాల స్థలాన్ని కేటాయించారు. టీఎస్ మోడల్ స్కూల్, పాలిటెక్నిక్ కళాశాలలకు పక్కనే ఈ స్థలాన్ని ఎంపిక చేశారు. కానీ నిధులు మంజూరు కాలేదు. దీంతో ఎంపిక చేసిన స్థలం అలంకారప్రాయంగా మిగిలింది.

ప్రతిపాదనలు పంపించాం

నవీపేటలో అనువైన ప్రభుత్వ, ప్రైవేటు భవనాలు లేకపోవడంతో నవీపేటకు మంజూరైన బాలికల గురుకుల పాఠశాలను జిల్లా కేంద్రంలో కొనసాగిస్తున్నాం. ఈ ఏడాది ఆరంభంలో కూడా ప్రైవేట్ భవనం కోసం వెతికాం. కానీ ఎక్కడా లభించలేదు. పదెకరాల భూమిని కేటాయించారు. నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ప్రతిపాదనలు పంపించాం. – యేసుపాదం, సాంఘిక సంక్షేమ శాఖ రీజినల్ కో–ఆర్డినేటర్

కేసీఆర్ ప్రధానమంత్రి కావాలి

ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి


జీవన్‌రెడ్డి సమక్షంలో చేరుతున్న మచ్చర్ల వాసులు

ఆర్మూర్: తెలంగాణ మోడల్ దేశమంతా అమలు కావాలని కోరుకుంటూ ముఖ్యమంత్రి కేసీఆర్ రానున్న రోజుల్లో దేశ ప్రధాని కావాలని ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి తన కోరిక వెలిబుచ్చారు. అంకాపూర్‌లోని ఆయన నివాసంలో బీఆర్ఎస్ పార్టీలో చేరికల కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలూర్ మండలంలోని మచ్చర్ల గ్రామానికి చెందిన యాదవ సంఘం ప్రతినిధులు, రైతులు, యువకులకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆర్మూర్ పట్టణంలోని పిప్రి గల్లీకి చెందిన మున్నూరు కాపు కులస్తులు పార్టీలో చేరారు. అనంతరం వారినుద్దేశించి మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమ ఫలాలే బీఆర్ఎస్ పార్టీ బలాలని,మూడోసారి బీఆర్ఎస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

మేరు కుల సంఘం నూతన కార్యవర్గం

ఆర్మూర్ పట్టణంలోని మేరు కుల సంఘం నూతన కార్యవర్గంతో ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అన్ని కులాల వారి సర్వతోముఖాభివృద్ధి లక్ష్యంగా సీఎం కేసీఆర్ పని చేస్తున్నారన్నారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత

ఆర్మూర్: ధ్యానం చేయడం వల్ల శారీరక సమస్యలు పరిష్కారం కావడంతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆర్మూర్ పట్టణంలోని నవనాథ సిద్దుల గుట్టపై నిర్మిస్తున్న నవనాథ సిద్దేశ్వర మహా పిరమిడ్ ధ్యాన మందిరం నిర్మాణం పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. స్ట్రక్చర్ నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా పీఎస్ఎస్ఎం నవనాథపురం కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.

చేసిన అభివృద్ధిని వివరించండి


ఎమ్మెల్యేని సన్మానిస్తున్న ఫత్తేపూర్ నేతలు

పెర్కిట్(ఆర్మూర్): గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనుల గురించి ప్రజలకు వివరించాలని ఎమ్మెల్యే జీవన్ రెడ్డి ప్రజాప్రతినిధులకు సూచించారు. ఆ ర్మూర్ మండలం అంకాపూర్ గ్రామంలో ఆదివారం ఫత్తేపూర్ గ్రామ ప్రజా ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామంలో రూ.5 కోట్ల నిధులతో పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. గ్రామంలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమం గురించి గ్రా మస్తులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కొత్త పల్లి లక్ష్మి, ఎంపీటీసీ కొక్కుల హన్మాండ్లు, నాయకులు లింబాద్రి, సోదర్ రెడ్డి పాల్గొన్నారు.

బట్టాపూర్ క్వారీతో పర్యావరణానికి నష్టం

- బీజేపీ రాష్ట్ర నేత మల్లికార్జున్‌రెడ్డి


ఏర్గట్లలో మాట్లాడుతున్న మల్లికార్జున్‌రెడ్డి

మోర్తాడ్(బాల్కొండ): ఏర్గట్ల మండలం బట్టాపూర్ క్వారీతో ప్రభుత్వానికి తీవ్ర నష్టం వాటిల్లడంతో పాటు పర్యావరణానికి ముప్పు వాటిల్లితుందని బీజేపీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ ఏలేటి మల్లికార్జున్ రెడ్డి స్పష్టం చేశారు. నిబంధనల ప్రకారం క్వారీ నడుపుతున్నామని యాజమాన్యం ప్రకటించడాన్ని ఆయన తప్పుబట్టారు. నిబంధనల ప్రకారం క్వారీ నడిపితే బహిరంగ విచారణకు ఎందుకు జంకుతున్నారని ప్రశ్నించారు. ఆదివారం ఏర్గట్లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బట్టాపూర్ క్వారీ అంశంపై ఆయన మాట్లాడారు. 2018లో క్వారీ ప్రారంభించి 2021లో పొల్యూషన్ కంట్రోల్ బోర్డుకు అనుమతి కోసం దరఖాస్తు ఎందుకు చేశారని ప్రశ్నించారు. పొల్యూషన్ బోర్డు పర్యావరణానికి ముప్పు అని అనుమతి ఇవ్వకపోయినా అక్రమంగా క్వారీని కొనసాగించారని ఆరోపించారు. 9,280 క్యూబిక్ మీటర్ల బండరాయిని తవ్వడానికి అనుమతి తీసుకుని 1.54 లక్షల క్యూబిక్ మీటర్ల బండరాయిని ఎలా తొలిచారని ప్రశ్నించారు. ప్రభుత్వానికి తీవ్ర నష్టం తీసుకొచ్చి ఇప్పుడు లేనిపోని స్టేట్‌మెంట్లు ఇస్తున్నారని అన్నారు. అక్రమాలపై అధికారులు విచారణ చేపట్టడానికి సాహసించడం లేదని దీనికి మంత్రి ప్రశాంత్‌రెడ్డి అండదండలు యాజమాన్యానికి ఉండటమే కారణమన్నారు. దమ్ముంటే అన్ని రకాల విచారణకు సిద్ధం కావాలని యాజమాన్యానికి సవాల్ విసిరారు.

మోదీని ఓడించే శక్తి కాంగ్రెస్‌కే ఉంది



ఆర్మూర్‌టౌన్: పట్టణంలో పలువురు ఎంబీటీ నాయకులు ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ నాయకులు కోల వెంకటేష్, సాయిబాబా గౌడ్‌లు ఎంబీటీ అధికార ప్రతినిధి సయ్యద్ అవేజ్, పార్టీ యూత్ ప్రెసిడెంట్ అబ్దుల్‌వాసి, వైస్ ప్రెసిడెంట్ సుమీర్‌లకు పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీఆర్ఎస్‌ను కేంద్రంలో మోదీని ఓడించే శక్తి కాంగ్రెస్ పార్టీకే ఉందన్నారు. జోడో యాత్ర స్ఫూర్తితో వివిధ పార్టీల నాయకుల చేరుతున్నారని అన్నారు. నాయకులు కర్తం గంగాధర్, హబీబ్, మీసాల రవి, ఫయీమ్, బట్టు శంకర్, ఉస్మాన్ పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి


బోధన్‌లో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నేతలు

బోధన్: విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం పోరాడుతామని ఎస్ఎఫ్ఐ డివిజన్ కన్వీనర్ సాయి తెలిపారు. ఆదివారం పట్టణ కేంద్రంలో నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు.మన ఊరు–మన బడి కార్యక్రమం ద్వారా అన్ని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్పొరేట్ విద్యా సంస్థల్లో జీవో నంబర్–01, 93ల ను అమలు చేయాలన్నారు. విద్యా హక్కు చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని పేర్కొన్నారు. నిబంధనలను ఉల్లంఘించి ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలు ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. విద్యాశాఖ అధికారులు స్పందించాలని డిమాండ్ చేశారు.

అంబేడ్కర్ విజ్ఞాన కేంద్రానికి నిధులు మంజూరు



ఆర్మూర్: పట్టణంలోని జర్నలిస్టు కాలనీలో అంబేడ్కర్ విజ్ఞాన కేంద్రం నిర్మాణానికి ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి రూ.5 లక్షలు మంజూరు చేశారని ఆర్మూర్ డివిజన్ దళిత ఐక్య సంఘటన ప్రతినిధులు తెలిపారు. పట్టణంలోని జర్నలిస్టు కాలనీలో కేటాయించిన స్థలాన్ని ఆదివారం వారు పరిశీలించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ.. దళిత యువకులకు ఈ కేంద్రం ఉపయోగకరంగా ఉంటుందన్నారు. స్థల పరిశీలన చేసిన వారిలో దళిత నేతలు జంగం అశోక్, కోటేశ్వర్, గుమ్మడి చంద్రయ్య, పింజ భూమేశ్వర్, ఎల్‌టీ కుమార స్వామి, బీఆర్ఎస్ నేతలు పూజ నరేందర్, పండిత్ పవన్ తదితరులున్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ కార్యకర్తలు


వేణుగోపాల్ సమక్షంలో చేరుతున్న కార్యకర్తలు

కమ్మర్‌పల్లి: రాజరాజేశ్వర్‌నగర్(నల్లూరు) గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్తలు ఆదివారం పీసీసీ అధికార ప్రతినిధి వేణుగోపాల్ యాదవ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ యాదవ్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు నచ్చక కాంగ్రెస్‌లో చేరడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సుంకెట రవి, నాయకులు భాస్కర్, రాజేశ్వర్, మల్లేష్, నటరాజ్, గురవయ్య, తదితరులు పాల్గొన్నారు.

సమాచారం..

నేడు మోస్రా మండలంలో స్పీకర్ పర్యటన

రుద్రూర్: మోస్రా మండలం చింతకుంట, గోవూర్ గ్రామాల్లో సోమవారం అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి పర్యటిస్తారని ఎంపీపీ పిట్ల ఉమాశ్రీరాములు తెలిపారు. గోవూర్ గ్రామం వద్ద నూతనంగా నిర్మించిన స్వాగత తోరణం ప్రారంభిస్తారు. చింతకుంట శివారులో సాగర్ కాలువపై రివర్స్ పంపింగ్ పనులకు భూమి పూజ చేస్తారని వివరించారు.

పోడు భూముల పట్టాల పంపిణీ

బోధన్: ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సోమవారం ఉదయం 11 గంటలకు నియోజకవర్గం పరిధిలోని లబ్ధిదారులకు పోడు భూముల పట్టాలను ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ ఆమేర్ పంపిణీ చేయనున్నారు. ఇందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. రెంజల్ మండలంలోని పేదలకు ఇళ్ల స్థలాల పంపిణీ కార్యక్రమం ఉంటుందని క్యాంప్ ఆఫీసు అధికారులు తెలిపారు.

పచ్చిక బయళ్లలో 'వన భోజనాలు'


డొంకేశ్వర్ వద్ద పచ్చిక బయళ్లలో వన భోజనాలు చేస్తున్న కుటుంబ సభ్యులు

డొంకేశ్వర్(ఆర్మూర్): మండలంలోని పలు గ్రామాల ప్రజలు ఆదివారం వన భోజనాలు చేశారు. కుటుంబ సభ్యులతో కలిసి పంట పొలాలు, ఎస్సారెస్పీ పచ్చిక బయళ్ల వద్ద సందడి చేశారు. పిల్లలు, పెద్దలు సరదాగా ఫొటోలు, సెల్ఫీలు దిగి రోజంతా ఆనందంగా గడిపారు.

ఒక్క వర్షానికే చిత్తడైన రోడ్డు

- పాదచారులకు ఇబ్బందులు
- మరమ్మతులకు నోచుకోని వైనం


చిక్లి ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి పాత ఊరు వరకు వేసిన సీసీ రోడ్డు దుస్థితి

మాక్లూర్: మండలంలోని చిక్లి గ్రామం నుంచి పాత గ్రామం వరకు వేసిన సుమారు కిలోమీటరు సీసీ రోడ్డు ఒక్క వర్షానికే చిత్తడిగా మారింది. సుమారు 25 ఏళ్ల క్రితం అప్పటి నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ అజార్ కిషన్‌రావు తన సొంత నిధులతో సీసీ రోడ్డు వేయించారు. అప్పటి నుంచి ఇప్పటివరకు మళ్లీ ఈ రోడ్డుకు కనీస మరమ్మతులు చేయలేదు. వేసిన సీసీ ఎక్కడికక్కడే పగుళ్లు ఏర్పడి గుంతలమయమైందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సీసీ రోడ్డుపై బీటీ రోడ్డు వేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఇరవై ఐదేళ్ల క్రితం వేశారు



సుమారు 25 ఏళ్ల ఈ సీసీ రోడ్డు వేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఈ రోడ్డుకు మరమ్మతులు జరగలేదు. సీసీ రోడ్డంతా గుంతలమయం అయింది. ఒక్క వర్షానికే వర్షం నీటితో చిత్తడిగా మారుతోంది. పాలకులు స్పందించి త్వరగా మరమ్మతులు చేయించాలి. నడవాలంటే చాలా ఇబ్బందులు పడుతున్నాం. – ఎడ్ల రాజేశ్వర్, చిక్లి, మాక్లూర్

ఆధ్యాత్మికం

వైభవంగా జగన్నాథ రథయాత్ర



బోధన్: ఇస్కాన్ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణ కేంద్రంలో జగన్నాథ రథయాత్ర కనుల విందుగా కొనసాగింది. మండల పరిషత్తు కార్యాలయం వద్ద రథయాత్రను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డీ మోహన్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. అక్కడ నుంచి పట్టణ ప్రధాన రోడ్డుల్లో రథయాత్ర సాగింది. జగన్నాథ నామస్మరణతో భక్త జనం పరవశించారు. బీజేపీ నాయకులు బాల్‌రాజ్, సంతోష్, హరికృష్ణ, నిర్వాహకులు పాల్గొన్నారు.

గ్రామ దేవతలకు జలాభిషేకం



పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ మండలం కేంద్రంలో ఆదివారం గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గ్రామ దేవతలకు జలాభిషేకం నిర్వహించారు. శ్రీరాం సాగర్ పరివాహక ప్రాంతం నుంచి తీసుకు వచ్చిన గంగా జలాలతో గ్రామంలో డప్పు వాయిద్యాల మధ్య ఊరేగింపు నిర్వహించారు. అనంతరం గ్రామ దేవతలకు భక్తిశ్రద్ధలతో జలాభిషేకం చేశారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆలూర్ శ్రీనివాస్ రెడ్డి, సర్పంచ్ కళ్లెం మోహన్ రెడ్డి, ఉప సర్పంచ్ దుమ్మాజి శ్రీనివాస్, వీడీసీ అధ్యక్షుడు బార్ల గణపతి, తదితరులు పాల్గొన్నారు.

బాల్కొండ పరిధిలో..



బాల్కొండ: బాల్కొండ, ముప్కాల్, మెండోరా మండలాల పరిధిలోని పలు గ్రామాల్లో ఆదివారం గ్రామ దేవతలకు జలాభిషేకం నిర్వహించారు. గంగాజలంతో ఊరేగింపు చేశారు. అనంతరం గ్రామాల్లోని పోశవ్వ, హనుమాన్, తాతాయి, సార్గమ్మ, శివాలయం సాయిబాబా, వెంకటేశ్వర ఆలయాల్లో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఘనంగా బోనాల పండుగ

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలో శ్రీకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా బోనాలు పండుగను నిర్వహించారు. నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వర్షాలు సంవృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని, ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని అమ్మవారిని కోరుకున్నారు. సంఘం అధ్యక్షులు శివప్రసాద్, ఉపాధ్యక్షుడు రమేష్, తదితరులున్నారు.

రుద్రూర్‌లో మహా లక్ష్మమ్మ పండుగ

రుద్రూర్: వర్షాలు సమృద్ధిగా కురిసి గ్రామం పాడి పంటలతో సుభిక్షంగా ఉండేలా చూడాలని గ్రామస్తులు ఐక్యంగా నిర్వహిస్తున్న గ్రామ దేవతల పండగ (ఊర పండగ) ఆదివారం కొనసాగింది. ఎనిమిదేళ్ల తరువాత పండగ జరుపుతున్నారు. గ్రామ పెద్దలు, కుల సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం ముడుపులు వేసే కార్యక్రమంతో పండగ ప్రారంభమైంది. రోజుకు ఒక ఉత్సవం నిర్వహిస్తున్నారు. ఆదివారం శ్రీమహాలక్ష్మమ్మ ఆలయం వద్ద ఉత్సవాలు జరిపారు. కుల సంఘాల వారీగా నైవేద్యం సమర్పించారు. పోతరాజుల సంప్రదాయ నృత్యాలు అలరించాయి.

తాగునీరు నేల పాలు

గోల్‌బంగ్లా ప్రాంతంలో వృథాగా పోతున్న మిషన్ భగీరథ నీరు



పైప్‌లైన్ కనెక్షన్ నుంచి పోతున్న నీరు



ఆర్మూర్‌టౌన్: పట్టణంలో పలు చోట్ల పైప్‌లైన్ లీకేజీలతో తాగు నీరు వృథాగా పోతున్నా వాటికి మరమ్మతులు చేద్దామన్న ఆలోచన అధికారులకు రావడం లేదు. కొన్నిచోట్ల కూలిపోయిన ఇళ్లకు సైతం మిషన్ భగీరథ పైప్ కనెక్షన్ ఉండటంతో ప్రతిరోజు అరగంట ఆ పైప్‌లైన్‌ల నుంచి నీరు వృథాగా మురికికాలువల్లోకి, రోడ్డుపైకి పోతోంది. పట్టణంలోని జిరాయత్‌నగర్, గోల్‌బంగ్లా, పెద్దబజార్‌లో ప్రతిరోజు వేల లీటర్ల తాగునీరు నేలపాలవుతోంది. అధికారులు స్పందించి పైప్‌లైన్ లీకేజీ మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

లీకేజీలను అరికడతాం

తాగునీటి పైప్‌లైన్‌లకు మరమ్మతులు చేయించి లీకేజీలను అరికడతాం. ప్రజలకు నీటి సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూ స్తాం. అవసరం లేని చోట వృథాగా ఉన్న మి షన్ భగీరథ పైప్‌లైన్ కనెక్షన్‌లను తొలగిస్తాం. – ప్రసాద్ చౌహాన్, మున్సిపల్ కమిషనర్, ఆర్మూర్

న్యాయవాదుల సంక్షేమానికి కృషి చేయాలి

సుభాష్‌నగర్: న్యాయవాదులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డిని తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు మంథని రాజేందర్ కోరారు. ఈమేరకు హైదరాబాద్‌లోని మంత్రి అధికారిక నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా న్యాయవాదుల సంక్షేమానికి సంబంధించి పలు విలువైన సూచనలను రాజేందర్‌రెడ్డి వివరించారు. అనంతరం రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ రూ.వంద కోట్ల నిధిని కేటాయించారని, ఆ నిధితోనే వేలాదిమంది న్యాయవాదులకు ఆరోగ్య భీమా పథకం అమలవుతుందన్నారు. మరణాంతరం రూ.4లక్షలు పరిహారం అందిస్తున్నామని, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ఆర్థిక సహాయం అందిస్తున్నారని అన్నారు. మంత్రి సానుకూలంగా స్పందించి కృషి చేస్తానని హామీనిచ్చారన్నారు.